## పకడ్బందీగా ఎన్నికల బందోబస్తు

- మద్యం, డబ్బు పంపిణీని అరికట్టేందుకే చర్యలు
- మల్కాజిగిరి డీసీపీ జానకి దరావత్



ఆర్కేపురం చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది

నేరేడ్‌మెట్, అక్టోబర్ 24: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఇప్పటికే వచ్చాయని మాల్కాజిగిరి డీసీపీ జానకి దరావత్ తెలిపారు. మంగళవారం డీసీపీ కార్యాలయంలో డీసీపీ జానకి దరావత్ మాట్లాడుతూ.. రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ సిబ్బందికి సహాయంగా ఏడు కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు వచ్చాయని వివరించారు. ఈ బలగాలు స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి ఆయా నియోజకవర్గాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పకడ్బందీగా బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పాత నేరస్థులను బైండోవర్ చేస్తున్నామన్నారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇతర జిల్లాల నుంచి నగరంలోకి ప్రవేశించే సరిహద్దుల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. సరైన పత్రాలు లేకుండా నగదు, బంగారం, ఇతర వస్తువులు తరలిస్తే వాటిని సీజ్ చేస్తామన్నారు. తనిఖీలు పారదర్శకంగా ఉండే విధంగా ప్రతి తనిఖీని వీడియా రికార్డింగ్ చేస్తున్నట్లు డీసీపీ జానికి దరావత్ తెలిపారు.

## మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురిని హైదరాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీటీఎఫ్ అధికారులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.2లక్షల విలువజేసే 100 ఐఎంల్ మద్యం బాటిళ్లు, 30బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కంచర్ల కరుణారెడ్డి కథనం ప్రకారం.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా సోమవారం ధూల్‌పేట, గోల్కొండ, చార్మినార్, నాంపల్లి తదితర ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేయగా.. ధూల్‌పేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శ్రీనాథ్ బ్రిద, అనిల్ సింగ్, రఘువీర్‌సింగ్ వద్ద నుంచి రూ.1.2లక్షల విలువైన 100ఐఎంఎల్ లిక్కర్ బాటిళ్లు, 30బీర్ బాటిళ్లతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసులను స్థానిక ఎక్సైజ్ స్టేషన్లకు అప్పగించారు.

## చాక్లెట్స్ ఇస్తానంటూ.. బాలికపై లైంగిక దాడి

బంజారాహిల్స్, అక్టోబర్ 24: చాక్లెట్స్ ఇస్తానంటూ ఏడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో నివాసముంటున్న బాలిక (7) స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నది. సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉన్నది. సోమవారం ఆ బాలిక తన స్నేహితులతో కలిసి వీధిలో ఆడుకుంటున్నది. అదే సమయంలో సమీపంలో నివాసముంటున్న వాచ్‌మన్ మనోహర్ బాలికకు చాక్లెట్స్ ఇస్తానంటూ తన గదిలోకి తీసుకువెళ్లి.. లైంగికదాడికి పాల్పడ్డాడు. కొద్ది సేపటి తర్వాత ఏడుస్తూ ఇంటికి వచ్చిన ఆ బాలిక జరిగిన ఘోరాన్ని తన తల్లికి చెప్పింది. దీంతో వాచ్‌మన్‌ను నిలదీయగా.. తనకు ఏమీ తెలియదని బుకాయించాడు. ఇంటి యజమాని సైతం తన వాచ్‌మన్ ఎలాంటి తప్పుచేయలేదని, కావాలంటే పోలీసులకు ఫిర్యాదు చేసుకోవాలంటూ దబాయించాడు. దీంతో సోమవారం రాత్రి బాలిక కుటుంబసభ్యులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## లైంగిక దాడి కేసులో మురళీముకుంద్ అరెస్ట్

బంజారాహిల్స్, అక్టోబర్ 24: పనిమనిషిపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో ఓ ప్రైవేట్ స్కూల్ మాజీ చైర్మన్ మురళీముకుంద్‌ను సీసీఎస్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మూడునెలల కిందట తన ఇంట్లో పనిచేస్తున్న యువతి(22)ని గదిలోకి పిలిచి లైంగికదాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో బంజారాహిల్స్ పోలీసులు మురళీముకుంద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మురళీముకుంద్ తనపై లైంగిక దాడి చేశాడని బాధితురాలు ఆయన కుమారుడు ఆకర్ష్‌కు చెప్పగా.. ఆమెపై దాడికి పాల్పడటంతో అతడిపై కూడా కేసు నమోదైంది. ఎన్నికల విధుల్లో బిజీ, కీలక అంశాలతో ముడిపడి ఉండటంతో ఈ కేసు దర్యాప్తును సీసీఎస్‌కు బదిలీ చేశారు. సీసీఎస్ పోలీసులు మంగళవారం మురళీముకుంద్‌ను అరెస్టు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. మురళీముకుంద్‌కు 14రోజుల రిమాండ్ విధించడంతో.. ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా, ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న అతడి కుమారుడు ఆకర్ష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

**తనిఖీల పేరుతో..**

కేంద్ర బలగాలతో కలిసి పనిచేయండి

కేంద్ర బలగాల సమన్వయ సమావేశంలో నగర సీపీ సందీప్ శాండిల్యా సూచన

# సామాన్యులను ఇబ్బంది పెట్టకండి

సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): చెక్‌పోస్టుల వద్ద తనిఖీల పేరుతో సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని నగర పోలీసు కమిషనర్ సందీప్ శ్యాండిల్యా పోలీసు అధికారులకు సూచించారు. బంజారాహిల్స్‌లోని నగర పోలీసు కమిషనరేట్‌లో కేంద్ర బలగాలైన సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌తో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో సీపీ పాల్గొని, పోలీసులు, కేంద్ర బలగాలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సాఫీగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నియమించిన కేంద్ర బలగాలతో కలిసి సమన్వయంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నగరంలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సంబంధించిన విధుల గురించి కేంద్ర బలగాలకు వివరించారు. ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు వచ్చిన కేంద్ర బలగాలకు సరైన వసతులను ఏర్పాటు చేయాలని, వారితో కలిసి సమన్వయంగా పనిచేయాలని నగర ఏసీపీలను ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సమయంలో పోలీసు సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు పోలీసు కమిషనర్ (శాంతి భద్రతలు) విక్రమ్ సింగ్ మాన్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ సంతన కృష్ణ, ఐదుగురు అసిస్టెంట్ కమాండెంట్లతో పాటు 11 సీఏపీఎఫ్ కంపెనీలకు చెందిన సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



### బోరబండ ఠాణా పరిధిలో.. సీపీ ఆకస్మిక పర్యటన

ఎర్రగడ్డ, అక్టోబర్ 24: హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య మంగళవారం బోరబండ ఠాణాతో పాటు పీఎస్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారంటూ బోరబండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్‌ను మందలించినట్టు తెలిసింది. ఠాణా పరిధిలో ఎంత మంది రౌడీ షీటర్లు ఉన్నారు.. సమస్యాత్మక ప్రాంతాలెన్ని.. తదితర అంశాలను ప్రస్తావించగా.. ఇన్‌స్పెక్టర్ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో సీపీ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఠాణాలో అరగంట పాటు నిర్వహించిన తనిఖీల అనంతరం.. సీపీ తన వాహనంలో ఇన్‌స్పెక్టర్‌ను తీసుకుని ఠాణా పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ పర్యటన అనంతరం ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను సీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ సీపీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

## పాత కక్షలతో.. యువకుడి దారుణ హత్య


వెంగళరావునగర్, అక్టోబర్ 24: పాత కక్షలతో ఓ యువకుడిని బండరాళ్లతో మోది రౌడీషీటర్ హత్య చేశాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.వి.రామప్రసాదరావు కథనం మేరకు.. బాపూనగర్‌కు చెందిన తరుణ్(22) డిగ్రీ మధ్యలోనే మానేశాడు. అతడికి బల్కంపేటలోని రేణుకానగర్‌కు చెందిన రౌడీషీటర్ షరీఫ్(35) మిత్రుడు. గతంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. సెల్‌ఫోన్ గొడవలో షరీఫ్ జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. దీంతో తరణ్‌పై షరీఫ్ కక్ష పెంచుకున్నాడు. సోమవారం రాత్రి తరుణ్‌కు పరిచయమైన మిత్రులతో అతడిని దాసారం బస్తీలోని గుడిసెల ప్రాంతానికి షరీఫ్ రప్పించాడు. అందరూ కలిసి మద్యం తాగారు. అక్కడ తరుణ్, షరీఫ్ మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో షరీఫ్ ఫోన్‌చేసి తన అనుచరులను అక్కడికి రప్పించాడు. మంగళవారం తెల్లవారుజాము వరకు జరిగిన గొడవలో తరుణ్‌పై షరీఫ్, అతడి అనుచరులు బండరాళ్లతో తలపై మోదారు. తరుణ్ అపస్మారక స్థితిలోకి చేరాడు. బస్తీవాసులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు రావడంతో షరీఫ్, అతడి అనుచరులు అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు వెంటనే తరుణ్‌ను అమీర్‌పేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం మరో ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజాము 5 గంటల సమయంలో తరుణ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తరుణ్ తండ్రి జె.రూప్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుడు షరీఫ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తరుణ్ హత్య స్థానిక బాపూనగర్, దాసారాం పరిసర ప్రాంతాల్లో కలకలం సృష్టించింది. దీంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలో జరగకుండా ఎస్ఆర్ నగర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రౌడీ షీటర్ షరీఫ్

## కుషాయిగూడలో ఎల్బీనగర్ ఎస్‌వోటీ దాడులు

- హెరాయిన్ విక్రయిస్తున్న ఇద్దరి సహా.. ముగ్గురు వినియోగదారులు అరెస్టు
- రూ.12లక్షల విలువజేసే 100 గ్రాముల హెరాయిన్ స్వాధీనం




సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరితోపాటు డ్రగ్స్ వినియోగిస్తున్న ముగ్గురినిఎల్బీనగర్ జోన్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.12లక్షల విలువజేసే 100 గ్రాముల హెరాయిన్, 6 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ కథనం ప్రకారం... రాజస్థాన్‌కు చెందిన బజరంగ్ బిష్ణోయి అలియాస్ బజరంగ్(21), మహేందర్ బిష్ణోయి(19) కలిసి ఉపాధి కోసం నగరానికి వలసొచ్చారు. వీరిద్దరూ నేరేడ్‌మెట్‌లో నివాసముంటూ గ్యాస్ స్టౌ రిపేయిర్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. వచ్చిన సంపాదన సరిపోవడం లేదు. సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో బజరంగ్ బిష్ణోయి రాజస్థాన్‌లో తనకు పరిచయం ఉన్న ఓ వ్యక్తి ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేసి, తన దగ్గరి బంధువైన మహేందర్ బిష్ణోయి సహకారంతో నగరంలో విక్రయించడం మొదలు పెట్టాడు. బజరంగ్ సూచన మేరకు మహేందర్ డ్రగ్ పార్శిళ్లను రాజస్థాన్ నుంచి నగరానికి ప్రైవేటు, ఆర్టీసీ, లారీల్లో తరలిస్తున్నాడు. ఈ విధంగా తీసుకొచ్చిన డ్రగ్స్‌ను బజరంగ్ నగరంలో తనకు పరిచయం ఉన్న వినియోగదారులకు నేరుగా, రాపిడో ద్వారా విక్రయిస్తాడు. ఈ క్రమంలోనే సోమవారం కుషాయిగూడ ప్రాంతంలో డ్రగ్స్‌ను విక్రయిస్తుండగా.. సమాచారం అందుకున్న ఎల్బీనగర్ జోన్ ఎస్‌వోటీ బృందం కుషాయిగూడ పోలీసులతో కలిసి బజరంగ్, మహేందర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారితో పాటు డ్రగ్స్‌ను కొనుగోలు చేసిన రాజస్థాన్‌కు చెందిన అభిషేక్ బిషోని(19), పుక్రాజ్ బిషోని(20), శిషుపాల్ బిషోని(19)ని కూడా అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.12 లక్షల విలువజేసే 100 గ్రాముల హెరాయిన్, 6 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం, రూ.820 నగదును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును కుషాయిగూడ పోలీసులకు అప్పగించారు.

## వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

**పోలీసులకు ఫిర్యాదు**

సైదాబాద్, అక్టోబర్ 24 : వేర్వేరు ప్రాంతాల నుంచి ముగ్గురు అదృశ్యమయ్యారు. ఈ ఘటనలు సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగాయి. సబ్ ఇన్‌స్పెక్టర్ మమత కథనం ప్రకారం.. సైదాబాద్ సాయిరాంనగర్ నివాసి, ప్రభుత్వ ముద్రణాలయం ఉద్యోగి రాంబాబు (47) ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. రెండు రోజుల కిందట అతడు డ్యూటీకి వెళ్లి, తిరిగి ఇంటికి రాకపోవటంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### జీవన్‌యార్‌జంగ్ కాలనీలో..

జీవన్‌యార్‌జంగ్ కాలనీకి చెందిన సయ్యద్ అక్బర్ అలీ భార్య సకినా ఫాతిమా (26) గృహిణి. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె.. తిరిగి రాకపోవటంతో భర్త సయ్యద్ అక్బర్ అలీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు నెలల కిందట సకినా ఫాతిమా ఇంట్లో నుంచి నగదు, బంగారు ఆభరణాలను తీసుకొని వెళ్లిందని, ఆ తర్వాత 20 రోజులకు తిరిగి ఇంటికి వచ్చిందని తెలిపారు. తిరిగి 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి రాలేదన్నారు. ఆమె అదృశ్యంపై పోలీసులకు భర్త ఫిర్యాదు చేశాడు.

### సాయిరాం కాలనీలో..

అలాగే.. సాయిరాం కాలనీ ఈశ్వర్ సంయుక్త అపార్టుమెంట్‌లో నివసించే పోతుల రవికిరణ్ (36) ప్రైవేట్ ఉద్యోగి. ఉద్యోగానికి వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి పోతుల రామ్మూర్తి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన అదృశ్యాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ మమత తెలిపారు.